క్లుప్తంగా

బాలగంగాధర్ తిలక్‌కు ఘన నివాళి


దెందులూరు నర్సింగ్ కళాశాలలో బాలగంగాధర్ తిలక్ జయంత్యుత్సవంలో విద్యార్థులు

దెందులూరు: స్వాతంత్య్ర ఉద్యమ నాయకుడిగా బాలగంగాధర్ తిలక్ భారతావనికి స్ఫూర్తిదాయకమని దెందులూరు డీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. మంగళవారం కళాశాలలో బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ ఉద్యమంలో మహాత్మ గాంధీ కన్నా ముందు తరం నాయకుల్లో బాల గంగాధర్ తిలక్ ప్రముఖ పాత్ర పోషించి స్వాతంత్య్ర ఉద్యమ దిశగా యావత్తు భారతావనిని నడిపించారన్నారు.

28న దుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ

దెందులూరు: దెందులూరులో ఈ నెల 28న గ్రామ శివారు ప్రాంతంలోని కనకదుర్గమ్మవారికి రామదండు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో మేళతాళాలతో 108 మంది ముత్తైదువులతో, 108 కలశాలతో, 108 రకాల కావిడితో ఆషాఢం సారె సమర్పిస్తామని రామదండు ప్రతినిధులు సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. ఈ మహోత్సవంలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. 28న ఉదయం 7.20 గంటలకు విష్ణు ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభిస్తామన్నారు.

జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


చెట్టున్నపాడులో అవగాహన ర్యాలీలో అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

భీమడోలు: దోమలతో వ్యాధులు వ్యాపిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటి నిల్వలున్న ప్రాంతాలు దోమల ప్రధాన ఆవాసాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. కొల్లేరు గ్రామం చెట్టున్నపాడులో మంగళవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా డెంగీ జ్వరాల పట్ల అవగాహన ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులను చేతపట్టుకుని నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలను అశ్రద్ధ చేయరాదని, వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వారానికి ఒకరోజైన శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. జిల్లా సహాయ మలేరియా అధికారి జే.గోవిందరావు, ఆరోగ్య సూపర్‌వైజర్ రామకృష్ణ, నవీన, అసిస్టెంట్లు రమేష్‌బాబు, రాజు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ భావనారాయణ

పెదపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, గ్రామ రెవెన్యూ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించాలని పెదపాడు తహసీల్దార్ వి. భావనారాయణ, ఎస్సై శుభ శేఖర్ తెలిపారు. పెదపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎస్సైలు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాల అక్రమ నిరోధానికి కృషి చేయాల్సిన అవసరముందని చెప్పారు. చేపల చెరువుల యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పు కలిగించే కోళ్ల వ్యర్థాలను అక్రమ రవాణా చేయడం వాటిని చేపలకు మేతలుగా వినియోగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సదరు వ్యర్థాలను రవాణా చేస్తున్న వాహనాలపై కేసు నమోదు చేసేందుకు పోలీసులకు, రెవెన్యూ అధికారులు సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కైకరంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: కైకరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించడం కోసం బుధవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు గొల్లగూడెం ఏఈ వేణు తెలిపారు. వినియోగదార్లు సహకరించాలని కోరుతున్నామని ఏఈ తెలిపారు.

ఉప్పొంగుతున్న పంట కాలువలు


సిద్ధాపురంలో రహదారిని తవ్విన మట్టిని పొలాలకు అడ్డుగా గట్టు వేసిన దృశ్యం


తోకలపల్లి- సాయంపాలెం వంతెన వద్ద అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క తొలగింపును పరిశీలిస్తున్న తహసీల్దారు

- ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో సమస్య
- పలు గ్రామాలను ముంచెత్తుతున్న వరద
- పంట కాలువల గట్టు ఎత్తు చేసుకుంటున్న రైతులు


బువ్వనపల్లి జగనన్న కాలనీలోకి వరదనీరు పోటెత్తడంతో అధ్వానంగా రహదారుల దుస్థితి


కాపవరం కాలువ ఆయకట్టులో పొలాలకు రక్షణగా అడ్డుకట్ట వేసుకుంటున్న అడవికొలను రైతులు

నిడమర్రు: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలు మంగళవారం తగ్గుముఖంపట్టినా ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో మండలంలోని ప్రధాన పంట కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన పంట కాలువలైన చినకాపవరం, వెంకయ్య వయ్యేరుతోపాటు పందికోడు మురుగుడ్రెయిన్లు గంట గంటకూ ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో సోమవారం రాత్రి నుంచి కాపవరం కాలువ ఎగదన్నడంతో పల్లపు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. బువ్వనపల్లిలోని జగనన్న కాలనీ, పాత కొలనీల్లో ముంపునీరు చేరి రహదారులు జలమయమవుతున్నాయి. బావాయిపాలెంలోని ఎల్లమ్మ చెరువు ప్రాంతం చెరువులను తలపిస్తోంది. పందికోడు మురుగుడ్రెయిన్‌లోకి ఎగువ నుంచి వస్తున్న ముంపునీటితోపాటు కొట్టుకువస్తున్న గుర్రపు డెక్కను మంగళవారం తహసీల్దారు పోసిబాబు ఆధ్వర్యంలో తొలగించారు. గతంలో ఇదే ప్రాంతంలో గుర్రపు డెక్క కారణంగా వంతెన కొట్టుకుపోయింది. దీంతో ముందస్తుగా అప్రమత్తమైనట్లు అధికారులు చెబుతున్నారు. కొల్లేరు ప్రాంతంలో ఎగువ నుంచి వస్తున్న నీటితోపాటు ఉప్పుటేరు ఎగదన్నితే ఈ ప్రాంతం ముంపు బారిన పడకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. చినకాపవరం కాలువలోని ముంపునీరు వరి చేలల్లోకి రాకుండా అడవికొలను రైతులు స్వచ్ఛందగా జేసీబీలతో గట్టును ఎత్తు చేసుకుంటున్నారు. ఏటా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ముంపు నీటితో నష్టం వాటిల్లుతోందని ప్రజలు చెబుతున్నారు. కాపవరం కాలువ నీటి ప్రవాహ ఉధృతిని తగ్గించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్నివీర్ వాయు విభాగంపై అవగాహన


అగ్నివీర్ వాయుపథ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏలూరు డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్, కెరియర్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో అగ్నివీర్ వాయు విభాగంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహనకల్పించారు. యంగ్ ప్రొఫెషనల్ గట్టిమ్ ప్రవీణ్ కృష్ణ విద్యార్థులకు అగ్నివీర్ వాయుపథ్‌పై వివరించారు. 17.5 ఏళ్ల నుంచి 21 ఏళ్లలోపు గల స్త్రీ, పురుష అభ్యర్థులు ఇంటర్‌లో 50శాతం పైగా మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో అగ్నిపథ్ వాయు డాట్ సీడీఏసీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టరు చేసుకోవాలన్నారు. ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకుని అనంతరం పరీక్షకు హాజరుకావాలన్నారు. అగ్నివీర్ వాయువు విభాగంలో ఎంపికైన అభ్యర్థులకు నాలుగేళ్ల సర్వీసు చేయాల్సి ఉంటుందన్నారు. మంచి జీతంతో పాటు నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత పదవీ విరమణ చేసే సౌలభ్యం ఉంటుందని, 12 లక్షల పైగా పదవీ విరమణ గ్రాంట్ పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సెక్యూరిటీ విభాగంలో పనిచేసే అవకాశాలుంటాయన్నారు. మూడేళ్లకు అగ్నివీర్ స్కిల్ డిగ్రీ సర్టిఫికెట్ లభిస్తుందన్నారు. దానితో ఉన్నత చదువులు, ఉద్యోగాలు పొందవచ్చన్నారు. నారాయణపురం అరవింద శత జయంతి డిగ్రీ కళాశాల, మహాత్మా గాంధీ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికే విశ్వేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉంగుటూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం మండల ఎంపీడీవో డీఎల్ శర్మ, విద్యాశాఖాధికారులు ఎస్.రవీంద్రభారతి, కె.శ్రీనివాసరావు, రెవెన్యూ డీటీ బొడ్డేపల్లి దుర్గప్రసాద్‌కు ఉంగుటూరు యూటీఎఫ్ అధ్యక్షుడు వునుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి డాకి జోగినాయుడు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గౌరవాధ్యక్షుడు శీతాల సత్యనారాయణ మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేయాలని కోరారు. జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి, వునుముల రాంబాబు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ నుంచి ఐదు వరకు ఒకే పాఠశాలలో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లు శ్రీను, నాయకులు హరికృష్ణ, ఆనంద్ కుమార్, పుప్పాల నరసింహారావు, రాజేంద్ర ప్రసాద్, శివయ్య, ప్రేమ్ కుమార్, శింగవరపు శ్రీను, లక్ష్మీ నారాయణ, వర్మ, పాల్గొన్నారు.

పీఎంశ్రీ ద్వారా పాఠశాలల్లో ఆధునిక వసతులు


గుండుగొలనులో మాట్లాడుతున్న ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్య బలోపేతమవుతుందని భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల తొలి దశలో పీఎంశ్రీ పథకానికి ఎంపికైనందున మంగళవారం ఎంఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హెచ్‌ఎం గారపాటి కనక దుర్గా సునీత అధ్యక్షత వహించారు. ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటాయన్నారు. పాఠశాలలోని ఆట స్థలం, స్టెమ్ ల్యాబ్‌లు, పీఎంశ్రీ వివిధ మౌలిక వసతులను సమకూరుతాయన్నారు. తొలి విడతగా పాఠశాలకు రూ.లక్ష నిధులు మంజూరయ్యాయన్నారు. రెండో దశకు పూళ్ల ఉన్నత పాఠశాల ఎంపికైందన్నారు. నూతన విద్యా విధానంలో ప్లస్ టు పాఠశాలలుగా ఉన్న వాటికి కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీలో నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ పటిష్టమవుతుందన్నారు. ఇంటర్ విద్యార్థులు చక్కగా చదువుకుని తమ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు తగవు


భీమడోలులో ఏఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న దివ్యాంగుల సంఘం ప్రతినిధులు

భీమడోలు: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం ఆధ్వర్యంలో భీమడోలు పోలీస్‌స్టేషన్ వద్ద దివ్యాంగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్మిత సబర్వాల్ వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. ఐఏఎస్ అధికారిగా ఉన్నతోద్యోగంలో ఉన్న సబర్వాల్ దివ్యాంగుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేసి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రకటన చేయడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని నాగభూషణం డిమాండ్ చేశారు. అనంతరం ఏఎస్సై వేంకటేశ్వరరావుకు దివ్యాంగులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సిటీ అధ్యక్షుడు చింపాడ బాలు, మండల అధ్యక్షుడు ఉంద్రు బెంజిమన్, నాయకులు నక్కా రాము, సీహెచ్ నాగేశ్వరరావు, బి.తాతాచారి, కొమ్ము జోసఫ్,ఎస్ .శ్రీను, బి.అనిల్, కె.అంజిబాబు పాల్గొన్నారు.

ఎర్రకాలువ ఉగ్రరూపం


కొండేపాడులోకి వరదనీరు రాకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్టిన దృశ్యం

గణపవరం: ఎర్ర కాలువ ఉగ్రరూపం రోజురోజుకూ పెరుగుతూ గణపవరం మండలం కొండేపాడు గ్రామ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే గ్రామంలోకి వరదనీరు చేరడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. యర్ర కాలువ లోలెవల్ వంతెన వద్ద నుంచి వరద నీరు గ్రామంలోకి ప్రవేశిస్తుండటంతో ఇసుక బస్తాలను అడ్డుగోడగా కట్టి వరద నీరు రాకుండా అడ్డుకట్ట వేశారు. అయినా ఎర్ర కాలువలో వరద నీటి మట్టం పెరుగుతుండటంతో ఏ క్షణంగా గ్రామం మీదికి విరుచుకుపడుతుందోనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు. ఏటా వర్షాకాలంలో కొండేపాడు గ్రామానికి ముంపుబెడద షరా మామూలుగా మారిపోయింది. భారీ వర్షం కురిసినా, ఎర్ర కాలువ పొంగినా ముందుగా మునిగిపోయేది ఈ గ్రామమే. గణపవరం మండలంలో శివారు గ్రామమైన కొండేపాడు ముంపునకు ముందు, సాగునీటికి వెనుక అన్నట్లు ఉంటుంది. ఎర్ర కాలువ పరీవాహక ప్రాంతాల్లో కొండేపాడు ముందుగా ముంపు బారిన పడుతుంది. ప్రస్తుతం గ్రామంలోని పొలాలన్నీ ముంపుబారిన పడి, నడుములోతు నీటిలో ఉన్నాయి. ఎర్ర కాలువ నీటి ప్రవాహం పెరిగేకొద్దీ గ్రామానికి ముంపు సమస్య పెరుగుతుంది. రెండు రోజులుగా వర్షం తగ్గడంతో పరిస్థితి కొంత మెరుగైనా, ఎగువ ప్రాంతాల్లోని వరదనీరు ఎర్రకాలువకు చేరడంతో నీటి ప్రవాహం పెరుగుతోంది. దీనితో గ్రామంలోకి వరదనీరు రాకుండా గ్రామస్తులు ఇసుక బస్తాలు సిద్ధం చేసుకుని రేయింబవళ్లు కాపలా కాస్తున్నారు. ఉంగుటూరు మండలంలోని తల్లాపురం, నారాయణపురంలోని పంట పొలాలు ముంపునీటిలోనే ఉన్నాయి.

ముంపు ప్రాంతాల పరిశీలన


కోరుకొల్లులో రైతులకు సూచనలందిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

భీమడోలు: భారీ వర్షాల వల్ల పూర్తిగా వరి నాట్లు దెబ్బతింటే తక్కువ కాల పరిమిత గల వరి రకాలను సాగు చేసుకుని, రైతులు సాగు ఖర్చును తగ్గించుకోవాలని గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, లా ఫార్మ్ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. భారీ వర్షాల వల్ల గుండుగొలను శివారు కోరుకొల్లు ప్రాంతంలో ముంపు బారిన పడిన వరి పొలాలను మంగళవారం ఏలూరు ఏరువాక సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.పణికుమార్, భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి తదితర వ్యవసాయాధికారుల బృందంతో కలిసి పీవీ సత్యనారాయణ పరిశీలించారు. మునిగిన వరి నాట్లు కుళ్లిపోవడంతో రైతులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను వారికి సూచించి వారి అనుమానాలను నివృత్తి చేశారు. నారుమడి దశలో ఉన్న పంట ఐదు రోజుల వరకు ముంపునకు గురైతే ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. ఒక వేళ పంట పిలకలు తొడిగే దశలో ఐదు రోజుల వరకు నీట మునిగితే ఎకరాకు 10 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ చల్లాలన్నారు. తెగుళ్ల సోకకుండా ఒక లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండజిమ్ లేదా రెండు గ్రాముల మాంకోజెబ్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రధాన పొలం, నారుమడులు పూర్తిగా ముంపుబారిన పడితే యాజమాన్య చర్యలకు వీలుకాకపోతే 125 రోజుల తక్కువకాల పరిమితి గల వరి వంగడాలను ఎంటీయూ, 1153, 1156, 1210, 1293, 1290 వరి రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. తరచుగా ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ఎంటీయూ 1232, 1140 వంటి మధ్యస్థ కాల పరిమితి గల వరి రకాలను సాగు చేసుకోవాలని కోరారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో ఇప్పుడు వెదజల్లే పద్ధతిని పాటించడానికి వీలు కాదన్నారు. నారు తెచ్చుకుని నాట్లు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన గురుపూజ నవరాత్రి ఉత్సవాలు


వాకపల్లిలో నవరాత్రి ఉత్సవాల్లో పూజలు చేస్తున్న భక్తులు

గణపవరం: శ్రీయతీంద్ర నవరాత్రుల గురుపూజ మహోత్సవం మంగళవారం వాకపల్లిలో అట్టహాసంగా ముగిసింది. గ్రామంలోని నండూరి గాంధీ ఇంటి వద్ద వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. తొలుత పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమ పీఠాధిపతులు సీతారామ యతీంద్ర గురుదేవులు, లక్ష్మణ యతేంద్ర గురువులు, సీతారా మ గురుదేవుల చిత్రపటాలకు పాదపూజలు చేశారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు ఆంజనేయునికి తమలపాకులతో పూజలు చేశారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు నండూరి లీలావతి, నండూరి గాంధీ, నండూరి శ్రీని వాసు, నండూరి చిన గంగరాజు, గంధ్రోతుల నర్సింహారావు, దాసం నాగభూషణం, నండూరి నాగేశ్వరరావు, తంగెళ్ల నాగేశ్వరరావు, అడ్డగర్ల పుల్లారావు, నండూరి సూర్యచంద్రరావు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


వరి పైరు నుంచి ముంపు నీటిని తొలగించే పనిలో నిమగ్నమైన రైతు

పెదపాడు: నారుమడులను సంరక్షించుకునేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. అధిక వర్షాలకు ఇటీవల వరినాట్లతో పాటు, వరి నారుమళ్లు ముంపు బారిన పడ్డాయి. దీంతో వ్యయసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో 50,400 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పెదపాడు మండలంలో 17,500 ఎకరాలు, దెందులూరు మండలంలో 17,280 ఎకరాలు, పెదవేగిలో 7,500, ఏలూరులో 8,120 ఎకరాలు వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు 20వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. కేఈ కేనాల్‌లో నీటి విడుదల ఆలస్యం కావడంతో వరి నాట్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కొత్తూరు, కొత్తముప్పర్రులో నారుమడులు వేయాల్సి ఉంది.

పంట రక్షణకు యాజమాన్య పద్ధతులు

అధిక వర్షాలకు మునిగిన వరి పొలాల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులకు సూచిస్తున్నారు. నాట్లు వేసిన అనంతరం 7 నుంచి 30 రోజుల మధ్యలో ఉన్న నారు 5 రోజుల కన్నా ఎక్కువ కాలం నీటిలో మునిగి ఉంటే దెబ్బతినే అవకాశం ఉంది. మునిగిన నారుమడి నుంచి నీరు 5 రోజుల్లోపు పూర్తిగా బయటకు తీసిన తర్వాత 5 సెంట్ల నారుమడికి 1కిలో యూరియా, 1కిలో పొటాష్ వేసుకోవాలి. 1 గ్రాము కార్బండిజం లేదా 2 గ్రాముల కార్బండిజం మంకోజాబ్ పిచికారీ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. పిలకల దశలో వరి పంట మునిగితే నీరు దిగిన తర్వాత 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ముంపు నీటిని తొలగించాలి



పెదపాడు మండలంలో 3,200 ఎకరాల్లో వరినాటు వేశారు. అధిక వర్షాలకు పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. గ్రామాల్లో వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులకు సలహాలు అందిస్తున్నాం. నారు మడి, నాట్లు దెబ్బతినకుండా రైతులు నీటిని బయటకు పంపాలి. అనంతరం రైతులు వ్యవసాయ సహాయకుల సలహాలు పాటించాలి.

– వానపల్లి ప్రదీప్‌కుమార్, వ్యవసాయ అధికారి, పెదపాడు